సాక్షి అన్నమయ్య జిల్లా



ముమ్మరంగా లెప్రసీ సర్వే

జిల్లాలో ముమ్మరంగా లెప్రసీ సర్వే కొనసాగుతోందని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో శైలజ అన్నారు. సోమవారం ఆదపూరులో పర్యటించారు. - 8లో



మణిపూర్ మారణకాండపై వెల్లువెత్తిన నిరసన

మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై సోమవారం కడపలో క్రైస్తవ, ముస్లిం, అఖిలపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.1100	రూ.1220
రెండోరకం	రూ.970	రూ.1170

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 505 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత



ఫిర్యాదుదారుడితో మాట్లాడుతున్న ఎస్పీ

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కారానికి మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా ఎస్పీ ఆర్ గంగాధర్ రావు పోలీసు యంత్రాంగాన్ని ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. వివిధ సమస్యల పరిష్కారం కోసం 61 ఫిర్యాదులను ప్రజలు అందజేశారు. ఎస్పీ ప్రజలతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంబంధిత పోలీస్ స్టేషన్ అధికారులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చి ఫిర్యాదులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. స్పందన ఫిర్యాదులపట్ల అలసత్వం తగదన్నారు.కుటుంబ కలహాలు, ఆర్థికపరమైన నేరాలు, ఆస్తితగాదాలు ఇతరత్రా కారణాలతో ఫిర్యాదులు అందాయి.

193 మందికి 337.46 ఎకరాల భూ పంపిణీ



రికార్డులు పరిశీలిస్తున్న తహసీల్దార్

రామాపురం : రాయచోటి నియోజకవర్గంలో శనివారం జరిగిన అసైన్‌మెంట్ కమిటీ భూ పంపిణీ కార్యక్రమం జరిగింది. ఇందులో మండలంలోని నల్లగుట్టపల్లె, గువ్వలచెరువు, బండపల్లె, నీలకంఠ్రావుపేట గ్రామాలు మినహా 9 గ్రామాల్లో 193 మంది రైతులకు 337.46 ఎకరాల భూమిని పేదలకు డీకేటి పట్టాలు మంజూరు చేసినట్లు తహసీల్దార్ అరవింద్ కిషోర్ తెలిపారు సోమవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడుతూ మండలంలోని గోపగుడిపల్లె, సుద్దమళ్ల, కల్పనాయునిచెరువు, సరస్వతిపల్లి, రాచపల్లి, హసనాపురం, చిట్లూరు, కుమ్మరపల్లె గ్రామాల్లో ప్రభుత్వ భూమిని పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మిగిలిన రైతులకు కూడా రెండో విడత అసైన్‌మెంట్ కమిటీలో భూ పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



వైద్యపరీక్షలు నిర్వహిస్తున్న జిల్లావైద్యాధికారి కొండయ్య

సంబేపల్లె : సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నమయ్యజిల్లా వైద్యాధికారి కొండయ్య అన్నారు. సోమవారం మండల పరిధిలోని నారాయణరెడ్డిపల్లె పంచాయతీ ఎర్రగుంట్ల, జగనన్న కాలనీలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాతావరణ మార్పుల వలకల జ్వరాలు వచ్చే అవకాశం ఉందని, జాగ్రత్తగా ఉండాలన్నారు. నీటి నిల్వలు ఉన్న ప్రాంతాలను శుభ్రపరుచుకోవాలని సూచించారు.ఫీవర్‌సర్వే, లార్వాసర్వే,స్ప్రెయింగ్‌లు గ్రామంలో చేశారా లేదా అనే అంశంపై ఆరాతీశారు. మలేరియా గ్రామంలో ఎక్కువగా ఉందని, నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు.

దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్: వైఎస్సార్‌జిల్లా లివెందులలోని రమణప్ప సత్రం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో వర్క్ అడ్జెస్ట్‌మెంట్ కింద పనిచేసేందుకు జిల్లాలోని జెడ్పీ, మండల పరిషత్‌లు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఎస్‌జీటీ, స్కూల్ అసిస్టెంట్లు 28వ తేదీలోపు విద్యార్హత పత్రాలను సమర్పించాలని డీఈఓ రాఘవరెడ్డి తెలిపారు. హిందీ, ఇంగ్లీష్ మూడు పోస్టులు చొప్పున.. గణితం, ఫిజికల్, బయలాజికల్ సైన్సు పోస్టులు ఒక్కొక్కటి ఉన్నాయన్నారు. వివరాలకు 9951438684, 9381838336 నంబర్లలో సంప్రదించాలన్నారు.

ఓపెన్ స్కూళ్లలో..

కడప ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం(ఏపీఓఎస్ఎస్) (ఓపెన్‌స్కూల్) ద్వారా 2023–24 విద్యా సంవత్సరంలో పదో తరగతి, ఇంటర్మీడియెట్ కోర్సుల్లో ప్రవేశం కోసం నోటిఫికేషన్ విడుదలైందని, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని డీఈఓ రాఘవరెడ్డి, ఓపెన్ స్కూల్ జిల్లా కోఆర్డినేటర్ వెంకటసుబ్బారెడ్డిలు సంయుక్త ప్రకటనలో తెలిపారు. దరఖాస్తును ఆన్‌లైన్‌లో సబ్మిట్ చేయడానికి జులై 26 నుంచి సెప్టెంబర్ 25వ తేదీ వరకు గడువు ఉందని చెప్పారు. రూ. 200 అపరాధ రుసుంతో ఆన్‌లైన్‌లో ఆప్లికేషన్ సబ్మిట్ చేసేందుకు అక్టోబర్ 5వ తేదీ వరకు గడువు ఉందన్నారు. మరిన్ని వివరాలకు www. apopenschool.ap.gov.in వెబ్‌సైట్ నుంచి తెలుసుకోవచ్చన్నారు.

టమాటా రైతుకు తియ్యనిమాట

- తుమ్మనంగుట్ట ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ నిర్మాణం పూర్తి
- వర్చువల్ విధానంలో నేడు ప్రారంభించనున్న సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- టమాటా కొనుగోలుకు కోయంబత్తూరు లీఫ్ సంస్థతో ఒప్పందం
- 400 టన్నుల టమాట నిల్వ సామర్థ్యం
- 5000 కుటుంబాలకు ప్రయోజనం



బి.కొత్తకోట : తుమ్మనంగుట్ట పంచాయతీలో ప్రారంభానికి సిద్ధమైన టమాటా ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్

బి.కొత్తకోట : టమాట రైతుకు ప్రభుత్వం తియ్యనిమాట వినిపించింది. కష్టాలు, కన్నీళ్లకు ఇక సెలవంటూ కొత్తకబురు చెప్పింది. మార్కెటింగ్ బాధలిక ఉండబోవంటూ భరోసానిచ్చింది. వివరాలిలా ఉన్నాయి.. ఆపరేషన్ గ్రీన్ ప్రాజెక్టులో భాగంగా చిత్తూరు, వైఎస్సార్, అనంతపురం ఉమ్మడిజిల్లాల్లో 20 టమాటా పీపీసీ(ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్)లు మంజూరయ్యాయి. కేంద్ర ఆహార, మౌళిక వసతుల కల్పన మంత్రిత్వశాఖ, ఏపీ ప్రభుత్వ ఆహార శుద్ధి సంస్థ సంయుక్తంగా వీటిని చేపట్టాయి. 20 యూనిట్ల నిర్మాణ విలువ రూ.109 కోట్లు. ఇందులో భాగంగా అన్నమయ్య జిల్లాలో బి.కొత్తకోట మండలం తుమ్మనంగుట్ట, రామసముద్రం, ములకలచెరువుల్లో మూడు పీపీసీలు మంజూరయ్యాయి. ఒక్కో సెంటర్ నిర్మాణాన్ని రూ.5.5 కోట్లతో ప్రారంభించారు. ఈ నేపథ్యంలో తమ్మనంగుట్ట కేంద్రం పనులు పూర్తి కావడంతో నేడు (మంగళవారం) ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ప్రారంభించనున్నారు.

రైతులకు ఉపయోగాలెన్నో..

తుమ్మనంగుట్ట ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌తో టమాటా రైతాంగానికి ఎన్నో ప్రయోజనాలు కలగనున్నాయి. ఈ కేంద్రాన్ని గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘం నిర్వహిస్తుంది. 2018లో ఏర్పడిన ఈ సంఘం పరిధిలో 1,002 మంది టమాట రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరు పండిస్తున్న టమాటా పంటను విక్రయం కోసం మదనపల్లె, ములకలచెరువు, అంగళ్లు మార్కెట్‌లకు వ్యయ ప్రయాసాలకోర్చి తరలించుకోవాల్సిన పరిస్థితి ఇకపై ఉండదు. రవాణాఖర్చులు, మార్కెట్‌లో కమీషన్ ఉండదు. తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన లీఫ్ సంస్థతో రైతు సంఘం ఒప్పందం చేసుకోవడంతో ఆ సంస్థ ప్రతినిధులు ఇక్కడే టమాటాలను కొనుగోలు చేసి తరలించుకుంటారు. సంఘంలో సభ్యులైన రైతులు టమాటను ప్రాసెసింగ్ కేంద్రానికి తరలించుకుని విక్రయించుకుంటుంది. దీనికోసం లీఫ్ సంస్థ రైతులకు టమాటా ప్లాస్టిక్ క్రేట్లు, వాహనాలను సమకూరుస్తుంది. టమాటా రైతులకు నర్సరీల ద్వారా నాణ్యమైన టమాటా మొక్కలను అందిస్తుంది.

400 టన్నుల నిల్వ సామర్థ్యం

తుమ్మనంగుట్ట పీపీసీలో 400 టన్నుల టమాటా నిల్వ సామర్థ్యం ఉంది. ఇక్కడ ఏర్పాటుచేసిన యంత్రాలతో గంటకు 1.5 టన్నుల టమాటాను ప్రాసెస్ చేస్తారు. రైతులనుంచి ఇక్కడికి తరలించే టమాటాను శుద్ధి చేశాక గ్రేడింగ్ చేసి క్రేట్లలో నింపి ప్యాక్ చేస్తారు. లీఫ్ సంస్థ ప్రతినిధులు వీటిని కొనుగోలు చేసి తమిళనాడుకు తరలించుకొంటారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం పరిధిలో 42 పల్లెలకు చెందిన టమాటా రైతులు సభ్యులుగా ఉన్నారు. వీరంతా ఈ సేవలను సద్వినియోగం చేసుకునే వీలుంది. ఈ కేంద్రం పరిధిలో సుమారు 5వేల రైతు కుటుంబాలున్నాయి. వీరంతా ఈ కేంద్రం ద్వారా ప్రయోజనం పొందే అవకాశాలున్నాయి.

20మందికి ఉపాధి

ఈ కేంద్రం ద్వారా ప్రస్తుతానికి 20 మందికి ప్రత్యక్షంగా ఉపాధి కలుగుతోంది. ఇక్కడ పనిచేసేందుకు బయటి వ్యక్తులకు ఉపాధి కల్పించడం లేదు. ఈ సంఘం పరిధిలోని రైతుల కుటుంబాలకు చెందిన విద్యావంతులైన నిరుద్యోగులను గుర్తించి ఉపాధి కల్పిస్తున్నారు. వచ్చేరోజుల్లో ఉపాధి పొందేవారి సంఖ్య పెరుగుతుంది.

నేడు ప్రారంభం

తుమ్మనంగుట్ట పంచాయతీలో నిర్మించిన ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌ను సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో మంగళవారం ప్రారంభించనున్నారు. ఇందుకు సంబంధించి బి.కొత్తకోట మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాట్లు చేస్తున్నారు. కార్యక్రమానికి కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జిల్లా హార్టికల్చర్ అధికారి బి.రవిచంద్రబాబు తదితర అధికారులతో పాటు రైతులు హాజరవుతారు.

నేరుగా రైతులతోనే మార్కెటింగ్

కలెక్టర్ గిరీషా పీఎస్

బి.కొత్తకోట : తుమ్మనంగుట్టలో నిర్మించిన ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్ నుంచి రైతులు పండించిన నాణ్యమైన టమాటా, కూరగాయలకు నేరుగా రైతులతోనే మార్కెటింగ్ చేసే సౌకర్యం అందుబాటులోకి వస్తోందని కలెక్టర్ గిరీషా అన్నారు. మంగళవారం సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి వర్చువల్ విధానంలో ఈ పీపీసీని ప్రారంభించనుండటంతో దానికి సంబంధించిన ఏర్పాట్లను, సెంటర్‌లోని యంత్రాలు, వాటి పనితీరును సోమవారం ఆయన పరిశీలించారు. తొలుత స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సెంటర్ నిర్వహణ బాధ్యతలు చేపట్టిన గోదావరి రైతు ఉత్పత్తిదారుల సంఘ ప్రతినిధులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడారు. రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈఓ రవికుమార్ నుంచి నిర్వహణకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకొన్నారు. సెంటర్‌లో యంత్రాలు, టమాటా, కూరగాయల ప్రాసెసింగ్, గ్రేడింగ్, ప్యాకింగ్ విధానాలను పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మీడియాతో మాట్లాడుతూ సెంటర్ పరిధిలోని ప్రతిరైతుకు ప్రాసెసింగ్‌పై శిక్షణ ఇస్తామన్నారు. కాగా, ములకలచెరువు, రామసముద్రం ప్రాసెసింగ్ సెంటర్లు నిర్మాణంలో ఉన్నాయని, వీటిని మూడు నెలల్లో ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ, జిల్లా హార్టికల్చర్ అధికారి రవిచంద్రబాబు, తహసీల్దార్ రఫీక్ అహ్మద్, ఎంపీడీఓ శంకరయ్య, ఫుడ్ ప్రాసెసింగ్ సలహాదారు చంద్రబాబు పిళ్లై, సర్పంచులు రుక్మిణీ, నాగిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.



ప్రైమరీ ప్రాసెసింగ్ సెంటర్‌లో యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ గిరీషా

హాస్టళ్ల ఆవరణలో కూరగాయలు పెంచాలి



మాట్లాడుతున్న జాకీర్ హుస్సేన్

పుల్లంపేట : పుల్లంపేట మండలంలోని సాంఘిక సంక్షేమ బాలుర వసతి గృహాన్ని సోమవారం అన్నమయ్య జిల్లా సాంఘిక సంక్షేమశాఖ ఉపసంచాలకులు జాకీర్‌హుస్సేన్ తనిఖీ చేశారు. అనంతరం అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జాకీర్ హుస్సేన్ మాట్లాడుతూ ప్రతి హాస్టల్ ఆవరణలో కూరగాయలు పెంచాలని సంబంధిత అధికారులకు సూచించారు. బయోమెట్రిక్ విధానంలో జిల్లాలో పుల్లంపేట బాలుర వసతి గృహం ప్రథమ స్థానంలో నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సాంఘిక సంక్షేమ సహాయ అధికారి శ్రీనివాసులు, ప్రేమ్ సాగర్, రఘురామయ్య, శ్రీరామ్ నాయక్, గిరి ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం



దిలీప్‌కుమార్ మురళీధర్

మదనపల్లె సిటీ : జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ కార్యవర్గాన్ని ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్, కార్యదర్శి డేనియల్ ప్రదీప్ ప్రకటించారు. జిల్లా ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉత్తారాది దిలీప్‌కుమార్, కార్యదర్శిగా కందుకూరు మురళీధర్, ఉపాధ్యక్షుడిగా సాగర్, జాన్ కమలేష్, కోశాధికారిగా వెంకటేశ్వరప్రసాద్, సహాయ కార్యదర్శిగా మహేంద్రనాయక్‌లను ఎన్నుకున్నారు.

26న జిల్లా సబ్ యూనియర్ జట్ల ఎంపిక

స్థానిక మిషన్‌కాంపౌండ్‌లో ఈనెల 26న జిల్లా ఫుట్‌బాల్ సబ్ జూనియర్ బాలురు, బాలికల ఫుట్‌బాల్ ఎంపికలు జరుగుతాయని జిల్లా కార్యదర్శి ప్రదీప్ తెలిపారు. క్రీడాకారులు 1.1.2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 95020741467 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

ఏకోపాధ్యాయ పాఠశాలలకు చెక్

సీఆర్‌పీలు ఇక సీఆర్‌ఎంటీలు

మదనపల్లె సిటీ : ప్రాథమిక విద్య బలోపేతానికి విద్యాశాఖ చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా సీఆర్‌పీలు ఏకోపాధ్యాయ పాఠశాలల్లో పిల్లలకు పాఠాలు చెప్పాలని ఆదేశాలు జారీ చేశారు. సమగ్రశిక్షకు సంబంధించి మండల విద్యా వనరుల కేంద్రాల్లో సీఆర్పీ వ్యవస్థ పన్నెండేళ్లుగా నడుస్తోంది. ఇక నుంచి వీరు సీఆర్‌ఎంటీ(క్లస్టర్ రిజర్వ్ మొబైల్ టీచర్)లుగా మారనున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఏకోపాధ్యాయ పాఠశాలల్లో సంచార బోధనకు సీఆర్‌టీలను వినియోగించనున్నారు. హాజరు కూడా ఆయా పాఠశాలల సముదాయ ప్రధానోపాధ్యాయుల వద్ద కాకుండా ఎంఈఓల వద్ద నమోదు చేయాల్సి ఉంటుంది.

జిల్లా వ్యాప్తంగా 148 మంది

2011లో క్లస్టర్ రిసోర్సు పర్సన్ (సీఆర్పీ) వ్యవస్థ ఏర్పడింది. జిల్లాలో 194 పాఠశాలల సముదాయాలను ఏర్పాటు చేశారు. ఒక్కో సముదాయానికి ఒక సీఆర్పీని నియమించారు. ప్రస్తుతం జిల్లాలో 194 మందికి గాను 148 మంది విధులు నిర్వహిస్తున్నారు. వ్యవస్థ ఆవిర్భావం నాటి నుంచి వీరంతా బడి బయట పిల్లల వివరాల సేకరణ, పాఠశాలల్లో నమోదు పెంపు, మధ్యాహ్నభోజన పథకం పర్యవేక్షణ, సమగ్రశిక్ష అధికారులు కోరిన సమాచారాన్ని పాఠశాలల నుంచి వివరాలు సేకరించి పంపడం చేసేవారు. అదనంగా ఒకే ఉపాధ్యాయుడు ఉన్న చోట సెలవు పెడితే పిల్లలకు పాఠాలు బోధించడం కూడా విధిగా ఉండేది.

ఇద్దరు ఎంఈవోల నియామకంతో...

ఇటీవల మండలానికి ఇద్దరు ఎంఈవోలను నియమించారు. పాఠశాలల పర్యవేక్షణకు ఎంఈవో 1, 2, సచివాలయాల్లో విద్యా సంక్షేమ సహాయకులున్నారు. బడి బయట పిల్లలను గుర్తించడానికి,నమోదు పెంచడానికి వలంటీర్లున్నారు. దీంతో సీఆర్పీలకు ఈ పనులన్నీ చేయాల్సిన అవసరం తప్పింది. అయితే జిల్లాలోని అన్ని మండలాల్లో ఏకోపాధ్యాయ, ఇద్దరున్న పాఠశాలలున్నాయి. వీటిల్లో పని చేస్తున్న ఉపాధ్యాయులు సెలవు పెడితే అక్కడ సీఆర్‌ఎంట సేవలను వినియోగించుకోవాలని ఉత్వర్వుల్లో పేర్కొన్నారు. అంటే అక్కడ విద్యార్థుల చదువులకు ఇబ్బంది తలెత్తకుండా సీఆర్‌ఎంటీలు సంచార ఉపాధ్యాయులుగా పాఠాలు బోధించనున్నారు.

అర్జీలను వేగవంతంగా పరిష్కరించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్

రాయచోటి : ప్రజా సమస్యలను సత్వరం పరిష్కరించి జగనన్నకు చెబుదాం, స్పందన కార్యక్రమంపై ప్రజల్లో మరింత నమ్మకాన్ని పెంచాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజాఫిర్యాదుల స్వీకరణ 'జగనన్నకు చెబుదాం స్పందన' కార్యక్రమం జరిగింది. జిల్లా కలెక్టర్, జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్,డీఆర్‌ఓ సత్యనారాయణలు ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఫిర్యాదుదారుల విజ్ఞప్తులను సంబంధిత అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి పారదర్శకంగా విచారణ చేయాలన్నారు. నిర్ణీత గడువులోగా వాటిని తప్పనిసరిగా పరిష్కరించాలని ఆదేశించారు.

'స్పందన'లో అందిన వినతులు..

రాయచోటి పట్టణానికి చెందిన హబీబ్ తాను ట్రాన్స్‌జండర్‌నని, ఎలాంటి స్థిర చరాస్తులు లేవని, తనకు ట్రాన్స్‌జెండర్ సర్టిఫికెట్ మంజూరు చేయించాలని కలెక్టర్‌కు విన్నివించారు. కలికిరి మండలానికి చెందిన ఎస్ రుఖియా జగనన్న లేఅవుట్‌లో ఇల్లు మొదలు పెట్టామని పెండింగ్ బిల్లులను మంజూరు చేయించాలని అర్జీ సమర్పించారు. కేవీపల్లెమండలం, వగల్ల గ్రామ పంచాయతీ కొండకిందపల్లి గ్రామానికి చెందిన బి వెంకటరమణారెడ్డి తన పొలం పడమర వైపున వర్షపునీరు పోవడానికి దారి ఉందని, ప్రస్తుతం ఆ దారికి అడ్డుకట్ట వేశారని, అందువల్ల పొలం గట్టు దెబ్బతిని పొలం కోతకు గురవుతోందని, దారి ఏర్పాటు చేయాలని కలెక్టర్‌కు విన్నవించారు.



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, జేసీలు

ఓటర్ల జాబితా సవరణ పక్కాగా నిర్వహించాలి

కురబలకోట : ఎన్నికల నిర్వహణలో స్పష్టమైన ఓటర్ల జాబితా అత్యంత కీలకమని దీని సవరణ కార్యక్రమం పక్కాగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ గిరీషాషా పీఎస్ సూచించారు. జిల్లా స్థాయిలో సోమవారం సాయంత్రం ఆయన అధికారులు, బీఎల్‌ఓలతో కురబలకోట రెవెన్యూ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణను బాధ్యతాయుతంగా నిర్వహించాలన్నారు. స్పష్టమైన ఓటరు జాబితా రూపకల్పనలో బీఎల్‌ఓల పాత్ర కీలకమన్న విషయాన్ని గుర్తుంచుకోలని, దీనిపై పూర్తి అవగాహన కల్గి ఉండాలన్నారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటికి తప్పనిసరిగా వెళ్లి పరిశీలించాలన్నారు. ఇప్పటికే వివిధ సందర్భాల్లో శిక్షణ ఆపై అవగాహన కల్పించినా ఉదాసీనత కన్పిస్తోందన్నారు. రాజకీయ పార్టీల నుంచి ఒకేసారి ఎక్కువగా దరఖాస్తులు అందినప్పుడు వాటిని పక్కాగా పరిశీలించాలన్నారు. ధవార్డు, గ్రామ వలంటీర్లు ఎన్నికల విధుల్లో ఉండరాదని ఎన్నికల కమిషన్ స్పష్టంగా సూచించిందన్నారు. డోర్ నంబరు, ఇంటిపేరు, పేర్లు, వయస్సు, చిరునామాలు, డబుల్ ఫొటోలు, డూప్లికేట్ ఓట్లు ఉంటే సరిచేయాలన్నారు. ఒక కుటుంబంలోని ఓట్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో ఉంటే వాటిని వారికి అనుకూలమైన పోలింగ్ స్టేషన్‌కు మార్చాలన్నారు.

మొక్కవోని దీక్ష

- సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో మొక్కల పంపిణీ
- జిల్లాలో అందుబాటులో 6.05లక్షల మొక్కలు
- పర్యావరణ పరిరక్షణే ధ్యేయం

పీలేరురూరల్ : హరితాంధ్ర ప్రదేశ్ నిర్మాణం వైపు ప్రభుత్వం అడుగులు వేస్తోంది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ అటవీశాఖ సామాజిక వన విభాగం ఆధ్వర్యంలో 2022–23 సంవత్సరానికి జిల్లాలోని రైతులకు, పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు, రోడ్డుకిరువైపులా నాటడానికి ఉచితంగా మొక్కలు పంపిణీకి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అన్నమయ్య జిల్లాలో రూ. 33 లక్షలతో 6.05 లక్షల మొక్కలు పంపిణీ చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు రాయచోటి డీఎఫ్‌వో నాగమణీశ్వరి తెలిపారు. ఆగస్టు, సెప్టెంబరు, అక్టోబరు మాసాల్లో మొక్కలు నాటడానికి అనువైన వాతావరణం ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల రైతులు ఆధార్ కార్డుతో సంప్రదిస్తే ఒక్కొక్కరికి వంద మొక్కలు ఉచితంగా, ఆపై రాయితీతో ఇవ్వనున్నట్లు చెప్పారు. కలికిరి మండలంలోని సీఆర్‌పీఎఫ్ కేంద్రానికి 15 వేలు, ఐటీబీపీకి 24 వేలు, బీఎస్‌ఎఫ్‌కు 5వేల మొక్కలు ఇవ్వనున్నట్లు చెప్పారు. పీలేరు గ్రామ పంచాయతీకి ఇది వరకే 15 వేల మొక్కలు పంపిణీ చేశామన్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆదేశాల మేరకు మరో 5వేల మొక్కలు ఇవ్వనున్నట్లు చెప్పారు.





నర్సరీలో పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు

డివిజన్ల వారీగా పంపిణీకి సిద్ధంగా ఉన్న మొక్కలు...

డివిజన్	నర్సరీ	అందుబాటులో ఉన్న మొక్కలు
పీలేరు	కలికిరిసెంట్రల్ నర్సరీ	2 లక్షలు
మదనపల్లె	బసినికొండ నర్సరీ	70 వేలు
తంబళ్లపల్లె	సవడసముద్రం నర్సరీ	1.5 లక్షలు
రాయచోటి	నల్లగుట్టపల్లె నర్సరీ	90 వేలు
	కేశావురం నర్సరీ	40 వేలు
రాజంపేట	పుల్లంపేట నర్సరీ	2.10 లక్షలు

అందుబాటులో ఉన్న మొక్కలు...

రైతులు పొలంలో సాగు చేవడానికి ఎర్రచందనం, టేకు, నారేప, వేప, రావి, మర్రి, అల్లనేరేడు, కుక్కనేరుడు, జామ, దానిమ్మ మొక్కలు, రోడ్లకు ఇరువైపులా నాటడానికి నిద్ర గన్నేరు, పచ్చతురాయి, ఎర్రతురాయి తదితర మొక్కలు అందుబాటులో ఉన్నాయి. నగర ప్రాంతాల్లో నాటడానికి పండ్లు, నీడనిచ్చె మొక్కలు పంపిణీకి సిద్ధంగా ఉన్నట్లు అటవీ శాఖ అధికారులు తెలిపారు.

విరివిగా మొక్కలు నాటాలి



హరితాంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దడానికి విరివిగా మొక్కలు నాటాల్సిన అవసరం ఉంది. ఈ మేరకు ప్రత్యేక చొరవతో అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా మొక్కలు నాటడానికి శ్రీకారం చుట్టాం. సాధ్యమైనంతవరకు రైతులకు ఉచితంగా మొక్కలు ఇవ్వడానికి తమవంతు కృషి చేస్తాం.

– పి.వి. మిథున్‌రెడ్డి, రాజంపేట ఎంపీ.

పర్యావరణ పరిక్షణకు కృషి చేయాలి



పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. ప్రభుత్వ పాఠశాలలు, కార్యాలయాలు, రోడ్డుకు ఇరువైపులా మొక్కలు నాటడానికి ఉచితంగా ఇవ్వడం జరుగుతోంది. మానవ మనుగడకు మొక్కలే ఆధారమని ప్రతి ఒక్కరూ గ్రహించాలి.

– చింతల రామచంద్రారెడ్డి, పీలేరు ఎమ్మెల్యే.

వృక్ష సంపదను కాపాడుదాం...



జిల్లాలో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం మొదలైంది. రైతులకు, పాఠశాలలకు, ప్రభుత్వ కార్యాలయాలకు ఉచితంగా మొక్కలు ఇస్తున్నాం. పర్యావరణ సమతుల్యాన్ని కాపాడటానికి విరివిగా మొక్కలు పెంచాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

– నాగమణీశ్వరి, డీఎఫ్‌వో, రాయచోటి.

మొక్కల పెంపకం.. సామాజిక బాధ్యత..



పర్యావరణ పరిరక్షణలో భాగంగా మొక్కల పెంపకం సామాజిక బాధ్యతగా తీసుకోవాలి. ప్రజలు తమ ఇళ్ల వంద, పొలాల్లో వీటిని నాటుకోవాలి. ప్రజల సంపూర్ణ ఆరోగ్యానికి, వర్షాలు సమృద్ధిగా కురవడానికి మొక్కలు ఎంతో దోహదం చేస్తాయి.

– జి. మధుసూదన్, డీఆర్‌వో, మదనపల్లె.

వైవీయూ పీజీ సెమిస్టర్ ఫలితాల విడుదల



పరీక్ష ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్, సీఈ

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం, అనుబంధ పీజీ కళాశాలల విద్యార్థుల 3వ సెమిస్టర్ ఫలితాలను వైస్ చాన్సలర్ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎస్. ఈశ్వరరెడ్డి విడుదల చేశారు. సోమవారం వైవీయూలో వీసీ మాట్లాడుతూ ఈ ఏడాది మార్చిలో 3వ సెమిస్టర్ పరీక్షలు నిర్వహించామన్నారు. పరీక్షా ఫలితాలను సబ్జెక్టుల వారీగా వివరించారు. ఎంసీఏ (97.92శాతం), ఎంఎస్సీ బోటనీ (100శాతం), బయోకెమిస్ట్రీ (100), కెమిస్ట్రీ (84.87, జియాలజీ (100), మ్యాథమ్యాటిక్స్ (73.33), మైక్రోబయాలజీ (100), ఫిజిక్స్ (90.32), బయోటెక్నాలజీ (100), కంప్యూటర్‌సైన్స్ (89.13), జువాలజీ (93.75), పర్యావరణశాస్త్రం (100), జెనిటిక్స్ అండ్ జీనోమిక్స్ (100), నానోటెక్నాలజీ (100), సైకాలజీ (100), ఫుడ్‌టెక్నాలజీ (100), ఫిజికల్ ఎడ్యుకేషన్ (100), ఫైన్‌ఆర్ట్స్ యేడాది వ్యవధి గల సర్టిఫికెట్ కోర్సుల్లో (100 శాతం) ఫలితాలు వచ్చాయన్నారు. ఉత్తమ ఫలితాలు సాధించిన కళాశాలల్లో అధ్యాపకులు, విద్యార్థులను వీసీ అభినందించారు. కార్యక్రమంలో పరీక్షల నియంత్రణ విభాగం సహాయ అధికారి డా. సుమిత్రి పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో విద్యార్థి మృతి


అష్రఫ్ మృతదేహం

మదనపల్లె : విద్యుత్ షాక్‌తో పదవ తరగతి విద్యార్థి మృతి చెందిన సంఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. పట్టణంలోని సైదాపేటకు చెందిన ముక్తియార్ కుమారుడు అష్రఫ్ (14) స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదవ తరగతి చదువుతున్నాడు. ఆదివారం అమ్మ చెరువుమిట్టలోని అమ్మమ్మ ఇంటికి కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు. వారు ఉంటున్న ఇంటి పైన చెట్టుకొమ్మలు అడ్డుగా ఉండటంతో.. తండ్రి ముక్తియార్ సోమవారం ఉదయం పక్కింటి మిద్దె పైకి వెళ్లి చెట్టుకొమ్మలు తొలగిస్తుండగా, అష్రఫ్ మిద్దెపైకి వెళ్లి ఈ విషయాన్ని చూడాలనుకున్నాడు. మిద్దెపైకి వెళ్లిన అష్రఫ్‌కు ప్రమాదవశాత్తు 11 కేవీ విద్యుత్ వైర్లు తగిలి షాక్‌కు గురయ్యాడు. వెంటనే కుటుంబ సభ్యులు స్థానిక ప్రభుత్వ జిల్లా ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మార్చ్యురీకి తరలించారు. విద్యార్థి మృతి సమాచారం తెలుసుకున్న బంధువులు, స్నేహితులు పెద్ద ఎత్తున ఆసుపత్రికి చేరుకున్నారు. కన్నకొడుకును చూసి తల్లిదండ్రులు బోరున విలపించారు. ఇళ్ల పైనుంచి విద్యుత్ తీగలు వెళ్తున్నా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించక పోవడంతోనే ఇలాంటి ప్రమాదాలు జరుగుతున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. విద్యార్థి మృతి చెందిన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే నవాజ్ భాషా ఆసుపత్రికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. తల్లిదండ్రులను పరామర్శించారు. ప్రమాద వివరాలను విద్యుత్‌శాఖ డీఈని అడిగి తెలుసుకున్నారు. ప్రమాద స్థలాన్ని పరిశీలించినట్లు డీఈ వివరించారు. మృతుని కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మణిపూర్ మారణకాండపై వెల్లువెత్తిన నిరసన


సీఎస్ఐ సెంట్రల్ చర్చి నుంచి ర్యాలీలో పాల్గొన్న మహిళలు



ఏడు రోడ్లు కూడలిలో ర్యాలీ నిర్వహిస్తున్న అఖిలపక్ష పార్టీల నాయకులు

- క్రైస్తవ, ముస్లిం, అఖిలపక్ష పార్టీల భారీ ర్యాలీ
- కదం తొక్కిన మహిళాలోకం

కడప సెవెన్‌రోడ్స్ : మణిపూర్‌లో జరుగుతున్న పరిణామాలపై సోమవారం కడప నగరంలో క్రైస్తవ, ముస్లిం, అఖిలపక్ష పార్టీలు తీవ్ర నిరసన వ్యక్తం చేశాయి. మణిపూర్ బాధితులకు సంఘీభావంగా నగరంలోని అన్ని చర్చిల సభ్యులు సీఎస్ఐ సెంట్రల్ చర్చి నుంచి ర్యాలీ నిర్వహించారు. అలాగే పెద్ద సంఖ్యలో ముస్లింలు ప్రదర్శనగా ఏడురోడ్ల కూడలికి చేరుకున్నారు. వివిధ రాజకీయ పార్టీలు పాల్గొని సంపూర్ణ సంఘీభావం ప్రకటించాయి. అనంతరం ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డికి వినతిపత్రాన్ని సమర్పించారు.

సత్వర న్యాయం చేయాలి

మణిపూర్ సంఘటనలు అత్యంత విచారకరమని, బాధితులకు రక్షణ కల్పించడంతోపాటు తక్షణ న్యాయం చేయాలని సీఎస్ఐ సెంట్రల్ చర్చి కార్యదర్శి పి.మనోహర్‌బాబు, ట్రెజరర్ పి.డేనియల్, సి.మత్తయ్యలు డిమాండ్ చేశారు. రాయలసీమ డయాసిస్ బిషప్ ఐజాక్ వరప్రసాద్ సూచనల మేరకు తాము ర్యాలీ నిర్వహించినట్లు తెలిపారు. మణిపూర్‌లోని ఒక వర్గానికి చెందిన మహిళలను అత్యంత అమానవీయ పద్ధతుల్లో నగ్నంగా ఊరేగించడం సభ్య సమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని పేర్కొన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే తగిన బలగాలను దింపి శాంతిభద్రతలను కాపాడాలని కోరారు. అన్ని వర్గాల ప్రజల్లో విశ్వాసం నెలకొల్పేందుకు తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కడప నగరంలోని క్రైస్తవుల మనోభావాలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని అధికారులకు విజ్ఞప్తి చేశారు.

దొరల గోరీలను పరిరక్షించాలి

కడప నగరంలో 217 సంవత్సరాల చరిత్ర గల దొరల గోరీలను పరిరక్షించాలని క్రైస్తవ సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. రహదారుల వెడల్పు పేరుతో మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు దొరల గోరీలను కూల్చాలనుకోవడం భావ్యం కాదన్నారు. ఏటా నవంబరు 2న సమాధుల పండుగ నిర్వహిస్తామని, అలాంటిది సమాధులు తొలగించాలనుకోవడం క్రైస్తవుల మనోభావాలను దెబ్బతీస్తుందన్నారు. తాము ఆర్ఎస్ రోడ్డు, మారుతినగర్‌లలో రహదారి విస్తరణ పనులకు స్థలాలు ఇచ్చి సహకరించామన్నారు. అభివృద్ధి పనులకు తాము వ్యతిరేకం కాదని, అయితే క్రైస్తవుల మనోభావాలు దెబ్బతినకుండా దొరల గోరీలను పరిరక్షించాలని కోరారు.

మోదీ, అమిత్‌షాల రాజీనామాకు డిమాండ్

మణిపూర్‌లో మహిళల మానప్రాణాలకు రక్షణ కల్పించలేని మోదీ, అమిత్‌షాలు వెంటనే రాజీనామాలు చేయాలని వైఎస్సార్‌సీపీ నాయకులు అహ్మద్‌బాష, సుబాన్‌బాష, కార్పొరేటర్ షఫీ, టీపీ వెంకటసుబ్బమ్మ, సీపీఐ నాయకులు ఈశ్వరయ్య, చంద్ర, సావంత్ సుధాకర్, సీపీఎం నాయకుడు రామ్మోహన్‌రెడ్డి, తెలుగుదేశం నాయకులు అమీర్‌బాబు, కాంగ్రెస్ నాయకులు సత్తార్, వివిధ మహిళా సంఘాల నాయకురాళ్లు బషీరున్నీసా, తస్లీమాలు డిమాండ్ చేశారు. మెజార్టీ తెగ అయిన మెహెతి ప్రజలను ఎస్టీ జాబితాలో చేర్చాలని అక్కడి ప్రభుత్వం జారీ చేసిన ఉత్తర్వులే హింసాయుత సంఘటనలకు కారణమన్నారు. ప్రభుత్వ వైఖరితో కుకి తెగకు చెందిన గిరిజనులు అభద్రతా భావానికి గురయ్యారన్నారు. రెండు తెగల మధ్య మొదలైన ఘర్షణ వల్ల మణిపూర్ అగ్నిగుండంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. మణిపూర్‌లో ఇంత జరుగుతున్నా ప్రధాని మోదీ మౌనం వహించడం దురదృష్టకరమన్నారు. రెండు తెగల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతూ రాజకీయ పబ్బం గడుపుకోవాలని బీజేపీ భావిస్తోందని విమర్శించారు. ఇప్పటికైనా మణిపూర్‌లో శాంతియుత పరిస్థితులు నెలకొల్పాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నగర కార్యదర్శి వెంకట శివ, ఏఐఎస్ఎఫ్ నాయకులు వలరాజు, ఏఐవైఎఫ్ నాయకుడు మైనుద్దీన్ పాల్గొన్నారు.


ఆర్డీఓకు వినతిపత్రం సమర్పిస్తున్న క్రైస్తవ పెద్దలు


ధర్నా నిర్వహిస్తున్న పీడీఎస్‌యూ నాయకులు


ర్యాలీ నిర్వహిస్తున్న అఖిల పక్ష, ప్రజా సంఘాల నేతలు

కొవ్వొత్తుల ప్రదర్శన

కడప వైఎస్ఆర్ సర్కిల్ : మణిపూర్ మారణకాండను నిరసిస్తూ ఏఐటీయూసీ ఆధ్వర్యంలో కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ కడప జిల్లా ప్రధాన కార్యదర్శి నాగసుబ్బారెడ్డి మాట్లాడుతూ మణిపూర్‌లో శాంతి భద్రతలను నెలకొల్పడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘోరంగా విఫలమయ్యాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ కడప నగర ప్రధాన కార్యదర్శి మద్దిలేటి, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు మల్లికార్జున, బుగ్గవంక వంతెనలు సాధన సమితి నాయకుడు హమీద్, మన్సూర్ అలీ, చేతివృత్తిదారుల సంఘం జిల్లా నాయకురాలు భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా

కడప ఎడ్యుకేషన్ : కడపలోని ఎస్వీ డిగ్రీ కళాశాల సర్కిల్‌లో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జాతీయ కన్వీనర్ రామక్రిష్ణ, రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు గని రాజు, రాజశేఖర్ మాట్లాడుతూ మణిపూర్ రాష్ట్ర ప్రభుత్వాన్ని వెంటనే భర్తరఫ్ చేయాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర సహాయ కార్యదర్శులు అంకన్న, కిరణ్‌కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వినోత్ సునీల్, జునైద్‌బాష, రాష్ట్ర కోశాధికారి జాకీర్, రాష్ట్ర నాయకులు నాగరాజు, కడప జిల్లా అధ్యక్షుడు నాగేశ్వర్, మానస, సాహితీ, ఉమ, అన్నమయ్య జిల్లా నాయకులు స్వరూప్‌తేజ్, శ్రీనాథ్, గోషీణ్, అరుణోదయం, భీమాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

హింసను అణచివేయాలి

కడప కార్పొరేషన్ : మణిపూర్‌లో జరుగుతున్న హింసను ఉక్కుపాదంతో అణచివేయాలని సోషల్ జస్టిస్ ఫర్ ఇంటర్నేషనల్ సివిల్ అండ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ వ్యవస్థాపకుడు షా మహమ్మద్, జిల్లా అధ్యక్షుడు పి.ఖాదర్‌బాషా కోరారు. మట్టిపెద్దపులి నుంచి హ్యూమన్ రైట్స్ ఆధ్వర్యంలో వన్‌టౌన్ గాంధీ విగ్రహం వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు లక్ష్మీనారాయణ, బుజ్జి, రఫీ, సర్దార్, నూర్ పాల్గొన్నారు.


కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహిస్తున్న ఏఐటీయూసీ, ఇతర ప్రజా సంఘాల నాయకులు

మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిద్దాం


పాఠశాలలో మొక్క నాటుతున్న ఐటీబీపీ సిబ్బంది, విద్యార్థులు

సంబేపల్లె : మొక్కలు పెంచి పర్యావరణాన్ని పరిరక్షిద్దామని ఐటీబీపీ కమాండెంట్ అమిత్‌భాటియా అన్నారు. సోమవారం మండల పరిధి దేవపట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని దెవరింటి రాజశేఖర్ స్మారక స్థూపం వద్ద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ) 53వ బెటాలియన్ వారు ప్లాంటేషన్ డ్రైవ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కమాండెంట్ మాట్లాడుతూ మొక్కల పెంపకం వల్ల రేడియేషన్ తగ్గుతుందని, వర్షాలు బాగా కురుస్తాయన్నారు. చెట్ల పెంపకం వల్ల వన్యప్రాణుల సంరక్షణ సాధ్యమవుతుందన్నారు. ఇండో టిబెటన్ బోర్డర్ పోలీసులు చేపట్టిన ప్లాంటేషన్ డ్రైవ్ స్ఫూర్తితో ప్రతి వ్యక్తి మొక్కలు పెంచడం బాధ్యతగా తీసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి ఓబుల్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఐటీబీపీ సిబ్బంది పాల్గొన్నారు.

సిమ్ కార్డుల అక్రమ విక్రేతలపై కేసులు

కడప అర్బన్ : సరైన డాక్యుమెంట్లు లేకుండా జిల్లాలో అక్రమంగా సిమ్ కార్డులు విక్రయించిన నలుగురిపై కేసు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం, డిపార్ట్‌మెంట్ ఆఫ్ టెలి కమ్యూనికేషన్స్ (డి.ఓ.టి) ఇటీవల నూతనంగా ప్రవేశపెట్టిన సీఈఐఆర్ (సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిఫై రిజిస్టర్) ద్వారా జిల్లాలో 110 మొబైల్ ఫోన్‌లు రికవరీ చేసినట్లు తెలిపారు.

సన్మార్గంలో నడవాలి

వేంపల్లె : ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం నైమిషారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి పేర్కొన్నారు. సోమవారం వేంపల్లెలోని శ్రీవృషభాచలేశ్వర దేవస్థానం అనుసంధానమైన వీరాంజనేయస్వామి ఆలయాన్ని ఆయన దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ఎన్.బట్టార్, హరిప్రవీణ్‌లు పూర్ణ కుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పీఠాధిపతికి శాలువా కప్పి సత్కరించి తీర్థ ప్రసాదాలను అందించారు. అనంతరం ఆలయ ఈఓ శ్రీధర్, ఆలయ చైర్మన్ కె.వెంకటేష్‌ల ఆధ్వర్యంలో శివ పురాణం, ప్రవచనాలు పఠించారు. కార్యక్రమంలో ఎంపీపీ లక్ష్మీగాయత్రి, ఆర్.శ్రీనివాసులు, ఆలయ కమిటీ సభ్యులు అరవింద్, బాలాజీ, శ్రీనివాసులు, హరికుమార్‌రెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

పెండ్లిమర్రి : మండలంలోని పొలతల మల్లేశ్వర స్వామిని నైమిశారణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సరస్వతి స్వామి దర్శించుకొన్నారు. మల్లేశ్వర స్వామి అనుబంధ ఆలయాలైన అక్కదేవతలు, బండెన్న, పుట్టా అంజన్నస్వామి ఆలయాలను సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ అంబటి నాగమల్లారెడ్డి, అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం


లక్షుమయ్య కుటుంబానికి రూ.10 లక్షల చెక్కు అందజేస్తున్న మేడా, ఆకేపాటి

నందలూరు(రాజంపేట) : ఓబులవారిపల్లి మండలం చిన్నఓరంపాడు వద్ద జరిగిన బస్సు ప్రమాద బాధితులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జునరెడ్డి అన్నారు. ప్రమాదంలో ఆడపూరు వాసి లక్షుమయ్య మృతి చెందగా, ఆయన కుటుంబానికి ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల చెక్కును జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథ్‌రెడ్డి, ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డితో కలిసి ఆయన అందజేశారు. లక్షుమయ్యతోపాటు బస్సులో ఉండి గాయపడిన ఆయన భార్య నరసమ్మ, సోదరుని కుమార్తె వెంకటసుబ్బమ్మలను వారు పరామర్శించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నరసమ్మ, వెంకటసుబ్బమ్మకు అమర హాస్పిటల్‌కు వెళ్లాలని సూచించారు. మెరుగైన వైద్యం అందించాలని అమర్ వైద్యుడిలో ఫోన్ ద్వారా కోరారు. గాయపడిన వారు తిరుపతిలోని అమర్ ఆసుపత్రికి వెళ్లడానికి అంబులెన్స్ వాహనం ఏర్పాటు చేస్తామన్నారు. తాము అండగా ఉంటామని ఎలాంటి ఆందోళన అవసరం లేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేత అన్నంనాగేంద్ర, మాజీ ఎంపీపీ లక్ష్మీనరసయ్య, వైఎస్సార్‌సీపీ నాయుడు సరేంద్ర, బద్రిరెడ్డి, మోదుగల చంద్రశేఖర్, డీటీ మోహనకృష్ణ పాల్గొన్నారు.

శేఖర్ కుటుంబానికి చెక్ అందజేత

రాజంపేట రూరల్ : చిన్నఓరంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో కొమరావతి శేషాద్రి శేఖర్ మృతి చెందగా, ఆయన కుటుంబానికి రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా చెక్‌ను ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి, జెడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి అందజేశారు. మండల పరిధిలోని వెంకటరాజంపేట గ్రామంలో సోమవారం శేఖర్ అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన మృతదేహానికి వారు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన సతీమణి కడపలో సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శ్యామలదేవికి ధైర్యం చెప్పారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు నాగా పృథ్వీపతిరెడ్డి, బొల్లినేని రామ్మోహన్‌నాయుడు, హస్తవరం ఉమామహేశ్వరరెడ్డి, వెలగచెర్ల గంగిరెడ్డి, పాలగిరి మల్లికార్జునరెడ్డి, దాసరి పెంచలయ్య, కోలా కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

జనారణ్యంలో దుప్పి


ఇంటిలోకి వచ్చిన దుప్పి

నందలూరు(రాజంపేట) : మేజర్ పంచాయతీ కేంద్రమైన నాగిరెడ్డిపల్లెకు సోమవారం దుప్పి వచ్చింది. నారాయణరాజుపేట గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతం నుంచి ఈ దుప్పి వచ్చి ఉంటుందని స్థానికులు అంటున్నారు. సూపర్ మార్కెట్ పక్కనే ఉన్న ఒక ఇంట్లోకి దుప్పి వచ్చింది. దీంతో ఆ ఇంటి వారు తలుపులు వేసి, దుప్పిని అక్కడే ఉంచారు. సమాచారంను అటవీశాఖ అధికారులకు చేరవేశారు. ఎఫ్‌బీవో లింగారెడ్డి, బేస్ క్యాంప్ సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దుప్పిని తీసుకొని వెళ్లి అడవిలో వదిలేశారు. ఈ విషయాన్ని రాజంపేట రేంజర్ నారాయణ ధ్రువీకరించారు.

భార్య ఆత్మహత్య కేసులో భర్త అరెస్ట్

రామాపురం : భార్య ఆత్మహత్య కేసులో భర్తను సోమవారం పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలు ఇలా ఉన్నాయి. సుద్దమళ్ల పంచాయతీ దూదేకులపల్లెకు చెందిన షేక్ మస్తాన్‌బీ, షేక్ ఇమ్రాన్‌లకు కొన్నేళ్ల క్రితం వివాహం అయింది. భార్యాభర్తలిద్దరూ కలిసి జీవనోపాధికై గల్ఫ్ దేశమైన కువైట్‌కి వెళ్లారు. పిల్లలు పుట్టలేదని తరచుగా వారు ఘర్షణ పడుతుండేవారు. భర్త వేధింపులు తట్టుకోలేక మస్తాన్‌బీ తన స్వగ్రామానికి చేరుకుంది. ఇంటికి వచ్చిన తరువాత కూడా ఫోన్‌లో తరచూ వేధిస్తూ ఉండే వాడు. ఈ క్రమంలో ఆమె గతేడాది జూలై 25న ఆత్మహత్య చేసుకుంది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇమ్రాన్ ఈ మధ్య కాలంలో స్వగ్రామానికి వచ్చినట్లు సమాచారం రావడంతో వారు అరెస్టు చేశారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్ర గాయాలు

ఓబులవారిపల్లె : మండల పరిధి చిన్నఓరంపాడులో విద్యుత్ ఘాతంతో ఓ యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. మండల కేంద్రానికి చెందిన తమ్మిరెడ్డి శ్రీనివాసులురెడ్డి బోరు మరమ్మతు పనులు చేస్తుంటాడు. సోమవారం చిన్నఓరంపాడు చేకూరి రమణ అనే రైతు వ్యవసాయం పొలం వద్ద బోరు మరమ్మతుకు శ్రీనివాసులురెడ్డి తన ఇద్దరు కుమారులు విష్ణురెడ్డి(20), చైతన్యరెడ్డిలను సాయం కోసం తీసుకెళ్లాడు. మరమ్మతులు చేస్తుండగా బోరు మరమ్మతులు చేసే ట్రాక్టర్ పైభాగం 11 కేవీ లైన్‌కు తగలడంతో కరెంటు సోకి మంటలు చెలరేగాయి. దీంతో ట్రాక్టర్ పట్టుకొని ఉన్న విష్ణురెడ్డికి తీవ్ర గాయాలయ్యాయి. చుట్టు పక్కల వారు గమనించి వైర్లు పక్కకు తీసి విష్ణురెడ్డిని చికిత్స నిమిత్తం తిరుపతికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం కోసం వేలూరు ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనలో చైతన్యరెడ్డికి కూడా స్వల్ప గాయాలయ్యాయి.

రేషన్ బియ్యం పట్టివేత

పోరుమామిళ్ల : పోరుమామిళ్ల నుంచి 774 రేషన్ బియ్యం బస్తాలతో బెంగళూరు వెళుతున్న లారీని ఆదివారం రాత్రి కడప విజిలెన్స్ సీఐ రెడ్డెప్ప, ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహసీల్దారు చంద్రశేఖర్ పట్టుకున్నారు. డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. లారీని, డ్రైవర్‌ను పోరుమామిళ్ల ఎస్ఐ మల్లికార్జునరెడ్డికి అప్పగించారు.

జిల్లాలో ముమ్మరంగా లెప్రసీ సర్వే


ఆడపూరులో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్ డీఎంహెచ్‌వో శైలజ

రాజంపేట : జిల్లాలో ముమ్మరంగా లెప్రసీ సర్వే కొనసాగుతోందని వైద్య ఆరోగ్యశాఖ జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ అన్నారు. సోమవారం నందలూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలో ఆడపూరు సబ్‌సెంటర్‌లో జరుగుతున్న లెప్రసీ సర్వేను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 1462 లెప్రసీ కేసులు ఉన్నాయన్నారు. ఆమె వెంట మండల వైద్యాధికారిణి డాక్టర్ సృజన, టీబీ సూపర్‌వైజరు పిల్లి జయప్రకాశ్, డీపీఎంవో సురేష్, వైద్యసిబ్బంది సురేష్, లక్షుమయ్య, ఆశా, ఏఎన్‌ఎంలు పాల్గొన్నారు.

టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితులపై ఆరా

టీబీ రోగుల ఆరోగ్య పరిస్థితులపై జిల్లా అడిషనల్ డీఎంహెచ్‌వో డాక్టర్ శైలజ ఆరా తీశారు. వైసీపల్లెలో టీబీ రోగుల ఇంటికి ఆమె వెళ్లారు. నివారణ చర్యలు, మందులు మింగడం తదితర అంశాలను రోగి నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం హెల్త్ అండ్ వెల్‌నెస్ సెంటర్‌ను తనిఖీ చేశారు. నందలూరు పీహెచ్‌సీపీ పరిధిలో పేదలకు అందుతున్న వైద్యసేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్‌సీడీ సర్వే, లెప్రసీ సర్వేలు బాగానే జరుగుతున్నాయని పేర్కొన్నారు.

హత్య కేసు దర్యాప్తు వేగవంతం


డీఎస్పీతో చర్చిస్తున్న ఏఎస్పీ రాజ్‌కుమార్

మదనపల్లె : మండలంలోని బోడిమల్లదిన్నె గ్రామంలో ఈ నెల 11వ తేదీన జరిగిన హత్య కేసు దర్యాప్తు వేగవంతం చేయాలని అడిషనల్ ఎస్పీ రాజ్‌కమల్ పోలీసు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక తాలూకా పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ కేశప్ప, తాలూకా సీఐ సత్యనారాయణతో కేసు దర్యాప్తుపై ఆయన చర్చించారు. ఈ నెల 11న బోడిమల్లదిన్నెకు చెందిన నారెం రాజశేఖర్‌రెడ్డి అలియాస్ రాజారెడ్డిని గుర్తు తెలియని వ్యక్తులు కాళ్లు, చేతులు కట్టి, నోట్లో గుడ్డలు కుక్కి గొంతుకు తువ్వాలు బిగించి హత్య చేసిన విషయం పాఠకులకు విదితమే. ఈ హత్య కేసు దర్యాప్తులోని కీలక విషయాలను డీఎస్పీతో చర్చించారు. అనంతరం హత్యా స్థలాన్ని పరిశీలించడానికి మరోసారి గ్రామానికి వెళ్లారు. అయితే వర్షం కారణంగా వెనుతిరిగి వచ్చారు. ఏదిఏమైనా త్వరలోనే హత్య కేసు నిందితులను అరెస్టు చేసేలా పోలీసు అధికారులు పని చేయాలని సూచించారు.

ఘర్షణ కేసులో 8 మందిపై కేసు

సిద్ధవటం : మండలంలోని నేకనాపురం గ్రామంలో ఆదివారం జరిగిన ఘర్షణలో 8 మందిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తులసీ నాగప్రసాద్ తెలిపారు. నేకనాపురం గ్రామంలో శ్రీనివాసులు, కుమార్‌రెడ్డి మధ్య మాటకుమాట పెరిగి ఘర్షణకు దారితీసిందన్నారు. ఈ సంఘటనలో శ్రీనివాసులుతోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కుమార్‌రెడ్డితోపాటు మరో ఏడుగురిపై కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.